ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 4 ఏప్రిల్ 2025




అమరావతిలో స్టార్టప్ ఏరియా (ఊహాచిత్రం)



అమరావతి అభివృద్ధిపై సింగపూర్ ప్రత్యేకంగా ఆసక్తి చూపుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సింగపూర్ సంస్థలు అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో సింగ్‌పూర్ ప్రతినిధి బృందం పర్యటించడం.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకం భేటీ కావడంతో.. స్టార్టప్ ఏరియా అభివృద్ధి తాజాగా తెరపైకి వచ్చింది. స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రణాళికకు మళ్లీ జీవం పోసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 40కిపైగా దేశాల్లో స్టార్టప్ ఏరియాలను అభివృద్ధి చేసిన సింగపూర్ సంస్థలు అమరావతిని కూడా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని పలువురు ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా అమరావతి స్టార్టప్ ఏరియా అభివృద్ధి గురించి మరికొద్ది రోజుల్లోనే మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

స్టార్టప్ ఏరియా అభివృద్ధికి.. జీవం

- సింగపూర్ బృందం రాకతో చిగురిస్తున్న ఆశలు
- సరికొత్తగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై చర్చలు
- ఆర్థిక లావాదేవీలకు ప్రధాన కేంద్రంగా చేయాలని లక్ష్యం



అమరావతిలో స్టార్టప్ ఏరియా

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతి అభివృద్ధికి అందివచ్చే ఏ ఒక్క అవకాశాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వదులడం లేదు. 2014-19లో అమరావతి నగర ప్రణాళికను మూడు దశలుగా అభివృద్ధి చేయాలన్న మాస్టర్‌ప్లానును ఇప్పుడు ఏకకాలంలో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్న కార్యాచరణతో ముందుకువెళ్తున్నారు. ఈ క్రమంలో రివర్‌ఫ్రంట్ ఏరియా లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం ప్రాంతాలలో అంతకుముందు అనుకున్న విధంగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి చేసే ప్రణాళికకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోస్తుంది. ఇందుకోసం గత నాలుగు మాసాలుగా సింగపూర్ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరుపుతుంది. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతూ సింగపూర్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి ఆహ్వానించింది. దీంతో ఆ బృందం బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించింది. తాజాగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సమాంతరంగా ఓఆర్ఆర్.. తాజాగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి కూడా జరగాలని ముఖ్యమంత్రి పథక రచన చేశారు. ఇందుకోసం సింగపూర్ కన్సార్షియంను మళ్లీ తెరమీదకు తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుంది. వాస్తవానికి సింగపూర్ కన్సార్షియంతో రాష్ట్రప్రభుత్వ ఒప్పందాలను గత వైసీపీ ప్రభుత్వం అవమానకరంగా రద్దు చేయించింది. అయినా చంద్రబాబు మళ్లీ వారితో సంప్రదింపులు చేసి మరోమారు పాత ఒప్పందాలను పునరుద్ధరించుకునే దిశగా ఆ బృందాన్ని ఒప్పించగలిగారు.

మూడు దశల్లో అభివృద్ధికి ప్రణాళిక

గతంలో స్విస్ ఛాలెంజ్ విధానంలో సుమారు 1691 ఎకరాలను పెట్టుబడులకు, వర్తక, వాణిజ్య సంస్థలకు కేంద్రంగా స్టార్టప్ ఏరియాను మూడు దశలుగా అభివృద్ధి చేయాలని ఓ యాక్షన్ ప్లాన్‌ను తయారుచేశారు. ఇందుకోసం కొన్ని ఒప్పందాలతో సింగపూర్ కన్సార్షియం ఏడీసీఎల్ కలిసి అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ ప్రైవేటు లిమిటెడ్‌గా ఏర్పడి మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయాలని భావించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ను గతంలో మాదిరి యథారీతిన అనుసరిస్తారా! లేక ఏవైనా మార్పుచేర్పులతో సరికొత్త ప్రణాళికలను రూపొందించుకుని తదనుగుణంగా ముందుకు వెడతారా అన్నది మరికొద్ది రోజుల్లో తేలనున్నది. గత ప్రణాళిక ప్రకారమైతే తొలిదశలో 656 ఎకరాలు, రెండోదశలో 514 ఎకరాలు, మూడో దశలో 521 ఎకరాలను అభివృద్ధి చేయాలని భావించారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు పెట్టుబడిని రూ.3137 కోట్లుగా అంచనా వేశారు. గత కాలపు ఒప్పందం ప్రకారం తొలిదశలో ఎనిమిది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చేలా ఓ మెగా టవర్‌ను నిర్మించాలి. ఇంకో నాలుగువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెల్‌కమ్ గ్యాలరీని నిర్మించాలి. రెండో దశలో ఇదే తరహా టవర్‌ను నిర్మించాలి. వీటిల్లో వచ్చే ఆఫీస్ స్పేస్‌ను లీజులకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రప్రభుత్వానికి 48 శాతం, సింగపూర్ కన్సార్షియం 52 శాతం వంతున పంచుకోవాలి. అలాగే మిగతా అభివృద్ధి చేసిన భూముల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి 75శాతం, సింగపూర్ కన్సార్షియంకు 25శాతం వంతున వచ్చేలా అప్పట్లో ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా ఈ నిబంధనలన్నీ మళ్లీ మారే అవకాశాలు ఉన్నాయి. భూమిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం వల్ల జాతీయ, అంతర్జాతీయ, వాణిజ్య, ఆర్థిక సంస్థలను ఇక్కడికి రప్పించి అమరావతి స్టార్టప్ ఏరియాను ఆర్థిక లావాదేవీలకు ఓ ప్రధాన కేంద్రంగా చేయాలన్నది కూడా ఓ లక్ష్యంగా ఉంది. దీనివల్ల ఆదాయం గణనీయంగా పెరగడంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. భూములకు కూడా ప్రభుత్వం ఆశించిన విధంగా మంచి ధరలు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఈ భూములను విక్రయించే బాధ్యత కూడా స్టార్టప్ ఏరియా డెవలపర్‌కే అప్పగించారు.

అమరావతికి.. 21 తర్వాత మోదీ

- రూ.లక్ష కోట్ల పనులకు ప్రధాని శ్రీకారం
- వెలగపూడిలో 250 ఎకరాల్లో సభా ప్రాంగణం
- 'ఆంధ్రజ్యోతి'తో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



నాగలక్ష్మి, కలెక్టర్



గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఈ నెల 21 తర్వాత ఏరోజైనా ఉండొచ్చు. ఇందుకోసం ముందస్తుగా అన్ని సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం..' అని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏ, ఇతర సంస్థలకు సంబంధించి రూ.40 వేల కోట్లకు పైగా విలువ చేసే పనుల టెండర్లు పూర్తి అయి గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలానే ప్రైవేటు విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, కళాశాలలకు సంబంధించి మరో రూ.60 వేల కోట్లకుపైగా ఉన్నాయన్నారు. మొత్తం కలిపి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీతో చేతుల మీదగా అంకురార్పణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరి, సీఎంవో నుంచి అందిన ఆదేశాలతో తాము ప్రధాని పర్యటన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వెలగపూడి సచివాలయం పక్కన ఉగాది నాడు జరిగిన పీ4 ప్రారంభోత్సవ వేదిక వద్దనే ప్రధానమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. ఆ ప్రాంతంలోనే దాదాపుగా 250 ఎకరాల్లో ప్రధాని సభా ప్రాంగణం ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. మోదీచే ప్రారంభమయ్యే పనులన్నీ రెండు, మూడేళ్లలోనే పూర్తి అయ్యేలా కార్యాచరణ ప్రణాళికని కూడా రూపొందించడం జరిగిందన్నారు.

సృష్టికి హాని కాదు.. మేలు చేద్దాం

తాబేళ్లు విడుదలలో ఎమ్మెల్యే కొండయ్య పిలుపు



సముద్రతీరంలోకి తాబేళ్లను వదులుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రామాపురం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూ ప్రపంచంలో ప్రతి జీవితో అనుబంధం ఉంటుంది.. అందువల్ల మనం జీవించి ఉన్నంత కాలం సృష్టికి హాని చేయకుండా వీలైనంత వరకు మేలు చేద్దాం.. అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. తీర భద్రతకు సంబంధించి కో-ఆర్డినేటర్ చంద్రరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1900 ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను ఎమ్మెల్యే కొండయ్య గురువారం తెల్లవారుజామున సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యసంపద ఉత్పత్తికి తాబేళ్లు ఉపయోగపడతాయన్నారు. పొట్టి సుబ్బయ్యపాలెం, రామాపురం, రామచంద్రపురం ప్రాంతాల్లో అటవీ అధికారులు తాబేళ్ల పెంపకానికి కృషి చేస్తున్నారన్నారు. దీనిద్వారా మత్స్యకారుల మనుగడ సులభంగా ఉండడమే కాకుండా భోజన ప్రియులకు మత్స్య సంపద అందుబాటులో ఉంటుందని చెప్పారు.

11 బీఈడీ కళాశాలలకు నోటీసులు

- పలు ఆరోపణల నేపథ్యంలో స్పందించిన ఎన్సీటీఈ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని 11 బీఈడీ కళాశాలలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) నోటీసులు జారీ చేసింది. పనితీరు అంచనా నివేదికకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వర్సిటీ పరిధిలోని గుంటూరు, నరసరావుపేట, రేపల్లె ప్రాంతాల్లోని కళాశాలలకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. కొందరు అధికారుల తీరుతో వర్సిటీ పరిధిలో బీఈడీ కోర్సు నిర్వీర్యం అవుతోందనే ఆరోపణలున్నాయి. మార్చిలో బీఈడీ ప్రశ్నపత్రం లీకైన విషయం తెలిసిందే. బీఈడీ ప్రయోగ పరీక్షల తనిఖీ బృందాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇటువంటి వారికి ప్రయోగ పరీక్షల్లో కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వచ్చాయి. ఒక విడత పరీక్షల్లో ఎగ్జామినర్‌గా, తనిఖీ బృందాల్లో కీలక సభ్యులుగా ద్విపాత్రాభినయంపైనా విమర్శలు వస్తున్నాయి. కొన్ని బీఈడీ కళాశాలలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.10,000 పైగా వసూలు చేసి పరీక్షలను పక్కదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇలా బీఈడీ కళాశాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ఎన్సీటీఈ నోటీసులు జారీ చేయడం గమనార్హం.



మూడేళ్లయినా.. తప్పటడుగులే

- బాపట్ల, పల్నాడు జిల్లాలు ఆవిర్భవించి నేటికి మూడేళ్లు
- ఇంకా అద్దె భవనాల్లోనే పలు కార్యాలయాలు
- పట్టాలెక్కని సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం
- సిబ్బంది కొరత.. వసతుల లేమి సరేసరి
- జిల్లా అధికారుల నియామకాలు లేవు.. ఇన్‌చార్జిలే దిక్కు



రెండు నెలల క్రితం వేసిన కలెక్టరేట్‌లోని అంతర్గత రోడ్డు



జిల్లా కలెక్టర్ కార్యాలయం



అపార్ట్‌మెంట్‌లో అద్దెకు కొనసాగుతున్న మైనింగ్, అటవీ విభాగాల కార్యాలయాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి.. పాలన ప్రక్షాళన.. ప్రభుత్వ సేవలు ప్రజల దరికి చేర్చాలని.. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేపట్టింది. అయితే ఆయా లక్ష్యాల మాటేమో కానీ జిల్లాల విభజనలోని చిక్కుముడులు ఇంకా కొనసాగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా పల్నాడు, బాపట్ల జిల్లాల విభజన జరిగింది. శుక్రవారంతో జిల్లాల విభజన జరిగి మూడేళ్లు అవుతుంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. 2022 ఏప్రిల్ 4న జిల్లాల విభజన జరగ్గా ఇంకా తప్పటడుగులతోనే పాలన సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా.. హడావుడిగా జిల్లా ఏర్పాటుతో సరిపెట్టింది. దీంతో ఇప్పటికీ ఉద్యోగుల విభజన మొదలు కార్యాలయాల ఏర్పాటు వరకు అన్నింటా అస్పష్టతే రాజ్యమేలింది. జిల్లా ఏర్పడిన ఆరు నెలల్లోపే సమీకృత కలెక్టరేట్ నిర్మిస్తామని, నిష్పత్తి ప్రకారం అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమిస్తామని, ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని.. ఆర్భాటంగా ప్రకటించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆ తర్వాత ఆ ఊసే మరిచారు. గత ప్రభుత్వం చెప్పిన మాటలు ఏ ఒక్కటీ అమలుకాకపోగా అటు ఉద్యోగులు, ఇటు ప్రజల గోడు వినే నాథుడే కరువయ్యారు. ఇక జిల్లాల స్థాయిలో ప్రగతి పనులు అమలు కూడా వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అభివృద్ధిలో కొత్త జిల్లాల్లో పల్నాడు జిల్లా వెనకబడి ఉన్నట్లు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి.

గాడిన పడని పాలన..

మూడేళ్లు అయినా అటు పల్నాడులో కానీ ఇటు బాపట్లలో కానీ పాలన ఇంకా గాడిలో పడలేదు. జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. జిల్లా కార్యాలయాల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు.. ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలకు

(మిగతా 8వ పేజీలో)

సమస్యలు ఇలా..

- జిల్లా కేంద్రమైన బాపట్లలో ఓ సొసైటీ కళాశాల భవనాల్లోనే దాదాపు పది ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరి ఉన్నాయి. మైనింగ్ విభాగం, జిల్లా అటవీ శాఖలు వివేకానందకాలనీలోనే ఓ ప్రైవేటు అపార్ట్‌మెంట్‌లో అద్దెకు నడుపుతున్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగం, మార్క్‌ఫెడ్ తదితర కీలక శాఖల కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.
- దాదాపు డజను విభాగాలకు జిల్లా అధికారులుగా ఇన్‌చార్జులే ఉన్నారు. అత్యంత కీలకమైన ఏపీఎంఐపీ మొదలు డ్రగ్స్, మత్స్యశాఖ, టూరిజం, పంచాయతీ, ఆర్అండ్‌బీ విభాగాలదీ ఎఫ్ఏసీల దారే. రెవెన్యూ విభాగంలో దాదాపు 6 మండలాల్లో ఇన్‌చార్జిలే తహసీల్దార్లుగా ఉన్నారు.
- జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తి మేరకు నియామకాలు జరిపితేనే దాదాపు 700 వరకు పోస్టులను తక్షణమే భర్తీ చేయాల్సి ఉంటుంది.
- ఇటీవల జరిగిన బదిలీల్లోనూ ఇక్కడకు రావడానికి ఉద్యోగులు ఆసక్తి చూపలేదు. అరకొరగా నియమించిన సిబ్బంది కూడా పైరవీలు చేయించుకుని ఉమ్మడి జిల్లా బాటే పట్టారు.
- కలెక్టరేట్‌లోని అంతర్గత రహదారుల బాగుపై గత ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టలేదు. రెండు నెలల క్రితమే ఆ రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

రేపల్లె-నిజాంపట్నం రోడ్డుకు మహర్దశ
రూ.9 కోట్ల 75 లక్షలు మంజూరు : మంత్రి అనగాని
6

పశువుల బీమా ప్రీమియం తగ్గింపు
15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం

8 అరచేతిలో.. పుర సేవలు
● అందుబాటులోకి పురమిత్ర యాప్ ● సులభంగా ప్రజల సమస్యలు పరిష్కారం

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా
అభ్యంతరాలకు 11వ తేదీ వరకు అవకాశం
6

రెండు కుటుంబాల మధ్య వివాదం
● కర్రలతో దాడి.. అక్కడికక్కడే వృద్ధురాలి మృతి ● జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిపైనా దాడి

తురకా కిశోర్‌పై పీడీ యాక్ట్



● గత ఐదేళ్లు రాజ్యాంగేతరశక్తి రెచ్చిపోయాడు ● పిన్నెల్లి సోదరుల అండతో మాచర్లలో దందాలు
6

రేపల్లె-నిజాంపట్నం రోడ్డుకు మహర్దశ


మంత్రి అనగాని

రేపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధికి రూ.9 కోట్ల 75 లక్షలు నిధులు మంజూరు చేయించామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గతప్రభుత్వ హయాంలో ఈ రహదారికి కనీసం మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. దశాబ్ధకాలంగా ఈరహదారిని అభివృద్ధిచేసిన దాఖలాలు లేవని కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దినెలలకే రహదారిని అభివృద్ధిచేసేందుకు నిధులు మంజూరుచెయ్యటం జరిగిందన్నారు. రేపల్లెనుంచి నిజాంపట్నం పూర్తిస్థాయిలో బీటీరోడ్డు నూతనంగా అభివృద్ధిచెయ్యన్ననట్లు తెలిపారు. పల్లపట్ల గ్రామంలో కిలోమీటర్‌మీరా పదిమీటర్ల వెడల్పుతో సీసీరహదారిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనిధుల మంజూరుకోసం రహదారి అభివృద్ధి చెయ్యటంలో కొంత జాప్యం జరిగిందని తెలిపారు. ఈరహదారి పనులను వారంరోజుల్లో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

పశువుల బీమా ప్రీమియం భారీగా తగ్గింపు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఉన్న పాడి పశువుల యజమానులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. పశువుల బీమా ప్రీమియాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు 20 శాతం వరకు రైతు వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ఈ ఏడాది 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదాహరణకు ఒక పాడి గేదె/ఆవు విలువ రూ. 30 వేలు గా ఉంటే, మూడు సంవత్సరాలకు ప్రీమియం కింద రూ.1920 చెల్లించాల్సి వచ్చేది. తాజా ఉత్తర్వులు ప్రకారం రైతులు కేవలం రూ.288 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఒక గొర్రె/మేక /పంది విలువ రూ.6 వేల వరకు ఉండగా, రైతు వాటాగా మూడు సంవత్సరాలకు గాను కేవలం రూ. 56 చెల్లిస్తే సరిపోతుంది. గతంలో కేవలం ఒక్కో రైతు ఐదు పాడి పశువులకు మాత్రమే బీమా చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం పది పాడి పశువుల వరకు బీమా చేసుకునే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా కేవలం 50 గొర్రెలు, మేకలకు మాత్రమే భీమా చేసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం ఒక్కో రైతు 100 గొర్రెలు, మేకలకు భీమా చేయించే అవకాశం కల్పించారు. ఈ పశు భీమా పథకం ద్వారా పశువు ప్రమాదం వలన గాని, వ్యాధుల వలన గాని, ప్రకృతి వైపరీత్యాల వలన గాని మరణిస్తే యజమానులకు నష్ట పరిహారం అందుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. పశువుల యజమానులు నిర్లక్ష్యం వహించకుండా భీమా చేయించుకోవాలని సూచించారు.

లారీ ఢీకొని మహిళ మృతి


వుయ్యూరు వెంకటరత్నం

పెదకాకాని, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలబడి ఉన్న మహిళను లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.... నంబూరు గ్రామానికి చెందిన వుయ్యూరు వెంకటరత్నం(52) అనే మహిళ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామం మెయిన్ రోడ్‌లోని శివాలయం సమీపంలో గోళ్ళమూడి నుంచి ఈమని గ్రామానికి వెళ్తున్న లారీ అదుపుతప్పి మహిళలను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరత్నానికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పెదకాకానిలోని అపరకర్మల సత్రం వద్ద ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

197 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు


రైతులకు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు అందజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 197 మంది రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్లాట్లు కేటాయించారు. విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ విధానం ద్వారా రైతులకు 494 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వాటిలో 297 నివాస ప్లాట్లు కాగా, 197 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నవులూరు, కురగల్లు, నిడమర్రు, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం గ్రామ రైతులకు ఈ- లాటరీ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయపూడి, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామ రైతులకు ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ విధానం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ- లాటరీకి హాజరైన రైతుల సౌకర్యార్థం సీఆర్డీఏ అధికారులు తొలుత ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్ల ఎంపికకు సంబంధించి ట్రైల్ రన్ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం లాటరీ ప్రక్రియను నిర్వహించి ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ.. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జీపీఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుమూ వసూలు చేయబోమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జీ. భీమారావు, ఎం.శేషి రెడ్డి, జీ. రవీందర్, ఏ.జీ. చిన్నికృష్ణ, పీ. పద్మావతి, జీ.రవీందర్, కే. స్వర్ణమేరీ, బీ. సాయి శ్రీనివాస నాయక్, కే. ఎస్. భాగ్యరేఖ, సీఆర్డీఏ ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్. నాగేశ్వరరరావు, సీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, ఏప్రిల్ 3: ఈనెల 12న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 10న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 11వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 12న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 13వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ. 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

గుంటూరు (విద్య) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి కల్పిస్తున్నట్లు డీఈఓ. రేణుక గురువారం తెలిపారు. పదోన్నతులకు అర్హులైన వారి జాబితాను డీఈఓ జిఎన్‌టి బ్లాగుస్పాట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఈ నెల 11 లోగా తెలియజేయాలని సూచించారు.


ప్రథమ స్థానం సాధించిన మద్దిరాల ముప్పాళ్ల ఎడ్ల జత

సబ్ జూనియర్ విభాగంలో..

మద్దిరాల ముప్పాళ్ల ఎడ్లజతకు ప్రథమ స్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో సబ్ జూనియర్ విభాగంలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన రైతు పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న బల ప్రదర్శనలో గురువారం జరిగిన పోటీలో ఈ ఎడ్లు 4200 అడుగుల దూరం బండ లాగాయి. మంతెనవారిపాలెంకు చెందిన రైతు మేకా ప్రతీక్ ఎడ్ల జత 3900 అడుగుల బండ లాగి ద్వితీయ స్థానం, పెనమలూరు మండలం పెదపులిపాక రైతు గరికపాటి శ్రీధర్ ఎడ్ల జత 3311 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న ఆచార్య ఆసిం బికాస్ దాస్

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎన్ఐటీ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్

గుంటూరు (విద్య) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధా(ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగంలోని సీఎస్ఈ, ఏసీఎస్ఈల సంయుక్త ఆధ్వర్యంలో రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయో ఇన్ఫర్మేటిక్స్ అండ్ బయోటెక్నాలజీ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రపంచవ్యాప్తంగా పెద్ద సవాలుగా మిగిలిపోయిన ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని, ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ రెండూ సమగ్ర, వ్యక్తిగతీకరించిన (పర్సనలైజ్డ్) ప్రెసిషన్ థెరపీ రూపంలో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా మార్చుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుదుచ్చేరిలోని ఐసీఎంఆర్ వెక్టర్ కంట్రోల్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ నంద కుమార్ యెల్లపు, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

7 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేత

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వైద్య సేవలను ఏప్రిల్ ఏడవ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.3500 కోట్లు నిలిచిపోవడంతో ఆర్థిక భారం మోయలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో చేసిన వైద్య సేవలకు సైతం ఇప్పటి వరకు పూర్తి చెల్లింపులు జరగలేదన్నారు. పలుసార్లు ప్రభుత్వానికి తమ ఇబ్బందులు వివరించి బకాయిలు తీర్చమని కోరామని, ఇకపై గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏప్రిల్ ఏడవ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద సేవలు నిలిపివేయాలని ఆషా నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు.

తెనాలి - గుంటూరు రైలుమార్గం పొడవునా స్టీల్ ఫెన్సింగ్

● 20.19 కిలోమీటర్ల పొడవునా ఇరువైపులా నిర్మాణం ● రూ. 13.7 కోట్లు మంజూరు చేసిన రైల్వేబోర్డు


యాంటీ క్రాష్ బ్యారియర్(నమూన)

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు జాతీయ రహదారులకు ఇరువైపులా నిర్మాణానికి పరిమితమైన యాంట్రీ-క్రాష్ బ్యారియర్/ డబ్ల్యూ-బీఎం స్టీల్ ఫెన్సింగ్‌ని రైల్వేట్రాక్‌ల వెంట కూడా ఏర్పాటు చేసేందుకు రైల్వేబోర్డు ఉపక్రమించింది. ఇందులో భాగంగా తెనాలి - గుంటూరు సెక్షన్‌లో తొలుత ఈ పనిని చేపట్టాలని నిర్ణయించింది. దీంతో గుంటూరు డివిజనల్ రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలిచారు. సాధ్యమైనంత త్వరగా ఏజెన్సీని ఖరారు చేసి ఏడాది వ్యవధిలోనే ఈ పనిని పూర్తి చేయాలని భావిస్తున్నారు. దీని వలన రైల్వేట్రాక్‌ల పైకి ట్రెస్‌పాస్‌లు, పశువులు రావడం వంటి చర్యలకు ఫుల్‌స్టాప్ పడి రైళ్ల రాకపోకలకు మరింత భద్రత ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో తెనాలి - గుంటూరు డబ్లింగ్ సెక్షన్ ఎంతో కీలకమైనది. పచ్చటి పొలాల మధ్య నుంచి ఈ రైలుమార్గం వేజండ్ల, సంగం జాగర్లమూడి, అంగలకుదురు మీదగా ఏర్పాటై ఉన్నది. అయితే ఇటీవలకాలంలో తరచుగా పశువులు హఠాత్తుగా ట్రాక్ పైకి వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా సందర్భాలలో లోకో(ఇంజిన్)లో పశువుల కళేబరాలు ఇరుక్కుపోయి మరమ్మతులకు గురౌతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రెస్‌పాసింగ్ జరగకుండా ఎలాగైతే యాంటీ-క్రాష్ బ్యారియర్/ డబ్ల్యూ-బీమ్ స్టీల్ ఫెన్సింగ్‌ని ఏర్పాటు చేస్తున్నారో అదే రీతిన రైలుమార్గాల పొడవునా ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. గుంటూరు - తెనాలి మధ్యన 20.19 కిలోమీటర్ల పొడవు రైలు మార్గం ఉన్నది. ఇరువైపులా కలుపుకొంటే 40.38 కిలోమీటర్ల పొడవునా ఈ యాంట్రీ-క్రాష్‌బ్యారియర్ నిర్మించాల్సి వస్తుంది. ఇందుకోసం రెండు టెండర్లను రైల్వే శాఖ ఆహ్వానించింది. ఒక్కో టెండరు విలువ రూ. 6 కోట్ల 88 లక్షల 48 వేల 385గా పేర్కొన్నది. రెండు నెలల్లో ఏజెన్సీలను ఖరారు చేసి ఏడాది వ్యవధిలో పనిని పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నది.

తురకా కిశోర్‌పై పీడీ యాక్ట్

- పలు కేసుల్లో ఇప్పటికే రిమాండ్

గుంటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలు కేసులకు సంబంధించి నెల్లూరు జైలులో మూడు నెలలుగా రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌పై గురువారం పీడీ యాక్ట్ నమోదయ్యింది. ఈ నేపథ్యంలో నెల్లూరు జైలు నుంచి రాజమహేంద్రవరానికి తరలిస్తున్నట్లు పట్టణ సీఐ ప్రభాకర్ రావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుని అండతో మాచర్ల ప్రాంతంలో రాజ్యాంగేతర శక్తిగా కిశోర్ రెచ్చిపోయాడు. మొదటి నుంచి పిన్నెల్లికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ ఆయన అండదండలతో మాచర్లలో దాదాగిరి చేసేవాడు. తర్వాత వైసీపీ మాచర్ల పట్టణ యూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. రౌడీయిజం చేస్తూ బెదిరింపులు, దందాలకు తెగబడ్డాడు. పంచాయితీలు చేస్తూ పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డాడు. టీడీపీ కార్యకర్తలనే కాదు సామాన్యులను సైతం భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ క్రమంలో పంచాయితీల వాటా పంపకాల్లో తేడాలు రావడంతో అప్పటి వైసీపీ నేత, తన సామాజిక వర్గానికి చెందిన చిన అంజిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే మొదటి నుంచి చిన అంజి, ఆయన అన్న పెద అంజి టీడీపీలో ఉండేవారు. మధ్యలో చిన అంజి వైసీపీలోకి వెళ్లినప్పటికీ కిశోర్ దాడితో తిరిగి టీడీపీలో చేరాడు. ఈ కక్షతో ఆయన సోదరుడు పెద అంజిపై పీడీ యాక్ట్ బనాయించి ఆరు నెలలు జైలుకు పంపాడు. పిన్నెల్లి సోదరుల అండతో పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తగులబెట్టడం, ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో దాడికి పాల్పడటం, బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌పై దాడి, హత్యాయత్నం, ఎన్నికల సమయంలో దాడులు ఇలా అనేక కేసుల్లో నిందితుడిగా తురకా కిశోర్ ఉన్నాడు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో బోండా ఉమా, బుద్దా వెంకన్నలపై హత్యాయత్నం చేసినందుకు కిశోర్‌కు మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పదవిని పిన్నెల్లి గిఫ్ట్‌గా ఇచ్చారు. ఈ పదవిని అడ్డంపెట్టుకుని రెండేళ్లకు పైగా కిశోర్ మాచర్లలో మరింతగా రెచ్చిపోయాడు. ఈ నేపథ్యంలో అతడిపై పలు హత్యాయత్నాలు, భూకబ్జాలు, దాడులకు సంబంధించి 8 కేసులు నమోదయ్యాయి. అతడు చేసిన దందాలన్నింటిపై కేసులు నమోదైతే కనీసం 100కు పైగా కేసుల్లో నిందితుడిగా ఉండేవాడని పోలీసులు సైతం చెబుతుండటం గమనార్హం.

వృద్ధురాలిపై కర్రలతో దాడి, అక్కడికక్కడే మృతి


షేక్ ఖాజాబీ

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనందపేటలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం వెలుగు చూసింది. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం...... ఆనందపేటకు చెందిన షేక్ ఫిరోజ్, ఫరోజ్ అనే ఇరువురు అన్న తమ్ముళ్లు. వీరికి అదే ప్రాంతానికి చెందిన ఆసిఫ్, సన్నీ అని ఇద్దరు స్నేహితులు ఉన్నారు. అయితే తమ చెల్లెలు గురించి అదే ప్రాంతానికి చెందిన హర్షత్ అనే యువకుడు అసభ్యంగా మాట్లాడటం జరుగుతుంది. దీంతో హర్షత్ ఇంటి మీదకుపై నలుగురు గొడవకు వెళ్లారు. హర్షత్‌తో గొడవ పడుతుండగా అడ్డొచ్చిన అతని తల్లి షాజహాన్, తండ్రి బాబును కొట్టారు. తీవ్రంగా గాయపడిని వారిని వైద్య చికిత్స నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు. మా ఇంటిపై దాడికి వచ్చారా అంటూ హర్షత్ అమ్మమ్మ షేక్ ఖజాబీ (70) ప్రశ్నించింది. దీంతో మరింతగా రెచ్చిపోయిన ఫిరోజ్, ఫరోజ్, ఆసిఫ్, సన్నీలు ఆమెపై కర్రలతో విచక్షణరహితంగా దాడి చేసి కొట్టారు. దీంతో ఆమె రోడ్డుపై పడి మృతి చెందింది. అంతటితో ఆగకుండా అక్కడ నుంచి గుంటూరు జి జి హెచ్ కి వెళ్లిన నలుగురు నిందితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు, షాజహాన్‌లను కూడా తీవ్రంగా కొట్టారు. ఖజాబీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా ఈ రెండు ఘటనలపై కేసులు చేశారు. ఈ కేసులో ప్రధాని నిందితులైన నలుగురు పరారీలో ఉన్నట్లు పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌ను సరండర్ చేసిన కలెక్టర్

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్ వెంకటేశ్వరరావును గుంటూరు కలెక్టర్‌కు సరండర్ చేస్తూ బాపట్ల కలెక్టర్ జె.వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వరరావుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొన్నిఫైళ్ళు మాయం చేశాడన్న ఆరోపణ కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల మధ్య పెద్దఎత్తున భేదాభిప్రాయాలు కూడా వచ్చాయి. ఇవికాకుండా గతంలో కూడా అయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉండటంతో కలెక్టర్ సరండర్ చేశారు. ఈ విషయమై డీపీవో ప్రభాకర్‌ను వివరణ కోరగా ఆరోపణల నేపథ్యంలో సరండర్ చేసినట్లు చెప్పారు.

వేసవిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు వడగాల్పులకు, తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ మాసం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాల్పులు ఎక్కువగా ఉంటాయని కలెక్టర్ చెప్పారు. ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలివేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగేచోట ఎండతీవ్రత తగ్గిన తర్వాత మొదలు పెట్టాలన్నారు. ఉదయం 11గంటలు నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పనులు విరామం ఇవ్వాలన్నారు. అత్యవసరమైన పరిస్థితుల్లో పని చేయవల్సివస్తే మంచినీళ్ళు, ఎలక్ట్రోనీళ్ళు, పండ్లరసాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు వారిని వేడి ప్రదేశం నుంచి చల్లని ప్రదేశానికి తీసుకురావాలన్నారు. ఒళ్ళు వెచ్చబడినట్లైతే తడిగుడ్డతో తుడవాలన్నారు. చల్లని నీటిని తీసుకోవాలని చెప్పారు. వెచ్చదనం తగ్గిన పరిస్థితుల్లో వారిని వెంటనే 108, 104లలో ఆస్పత్రికి తరలించాలన్నారు. వడదెబ్బ కారణాలుగా మరణాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఆశావర్కర్లు ఒంటరి వృద్ధ మహిళల ఆరోగ్య పరిస్థితులను ప్రతిరోజు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

● శానిటేషన్‌పై కలెక్టర్ ఆరా..

గ్రామాల్లో, పట్టణాల్లో శానిటేషన్‌పై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు.శానిటేషన్‌పై ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 42శాతం మంది అసంతృప్తి వ్యక్త పరిచినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు ఇంటింటా చెత్తసేకరణ చేపట్టాలన్నారు. బహిరంగప్రదేశాలలో వ్యర్థాలు పడవేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూ పీసీలు లేనిచోట్ల వారికి కావాల్సిన మౌలికసదుపాయాలు కల్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఉన్నవాటిని పాక్షికంగా వినియోగిస్తున్నారని వాటిని పూర్తి స్థాయిలో వినియోగించటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలపై ఆరా

సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లలోని నీటి నిల్వలపై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. వేసవి కాలంలో ఎక్కడ నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో పైపుల లీక్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయించాలని, నీరు వృథాకాకుండా, కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తక్కువ లోతుల బోర్ల నుంచి నీటిని వాడవద్దని అవి కలుషితానికి గురవుతాయని ప్రజలకు అవగాహన కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయాల్లో నిర్వహించే సర్వేలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇంటి వద్ద పనికి సంబంధించిన సర్వే పూర్తి కాలేదని ఈనెల 6వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. 6 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ నమోదును అంగన్‌వాడీ, ఏఎన్ఎంల సహకారంతో ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డీపీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, డీఎల్‌డీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం

● ఎంపీడీవో వెంకటరమణ

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ వెంకటరమణ గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ-శ్రమ కార్యక్రమం ద్వారా కార్మికులకు ప్రమాద బీమా సభ్యత్వ నమోదుకు ఈ నెల 4వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 60 సంవత్సరాలు లోపు వయసు కలిగిన కార్మికులందరూ పథకానికి అర్హులన్నారు. రూ.100 రుసుం చెల్లించి బీమా కోసం నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ, వలస, రిక్షా, మత్స్య, అంగన్‌వాడీ, ఆశా, ఉపాధి హామీ కూలీలు, చిరు వ్యాపారులు, డ్వాక్రా సంఘ సభ్యులు ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు ఆదాయ పన్ను పరిమితిలోకి రాని వారంతా బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు, కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాసేవే ప్రభుత్వం లక్ష్యం

● జడ్పీటీసీ నర్రాసుబ్బయ్య

రేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని పేదల ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రజలకు సేవ అందించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. గురువారం నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామంలో రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో విజయవాడ హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఏకో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ హాస్పిటల్ వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



సీతారామలక్ష్మణ విగ్రహాలు

చెరుకుపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం రాజవోలు పడమటిపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో గురువారం ఉదయం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ ధ్వజస్థంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సహస్ర ప్రతిష్టాచార్య ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం అన్నదానం జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ టి.అనిల్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయకమిటి సభ్యులు పర్యవేక్షించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్

● ట్రాఫిక్‌కు అంతరాయం

వేమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే ఇసుక లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను అతివేగంతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టి అదుపు తప్పిపడిపోయింది. ఈ సంఘటన తెనాలి-కొల్లూరు ప్రధాన రహదారిలోని చంపాడు కాల్వ వద్ద గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో జరిగింది. కొల్లూరు నుంచి తెనాలి వైపుకు వెళ్లే ఇసుక లోడు ట్రాక్టర్ డ్రైవర్ చంపాడు కాల్వ వద్ద రోడ్డు పక్కనే ఆపుకున్నాడు. కొల్లూరు వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ డ్రైవర్ అతివేగంతో వెళుతూ ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఆ సమయంలో టిప్పర్ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు మార్గం లేక వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో క్రేన్ సాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన టిప్పర్‌ను తొలగించారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఎస్ఐ రవికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిన్నటి దినం దేశానికి చీకటి రోజు

రేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిన్నటి దినం భారతదేశానికి చీకటిరోజని బ్లాక్‌డేగా అభివర్ణించారు. బీజేపీ గద్దెనెక్కినప్పటి నుంచి ముస్లింలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరిగణేష్ అన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముస్లింలపై నల్లచట్టాలను ప్రవేశపెట్టి మనోభావాలను బీజేపీ దెబ్బతీస్తుందన్నారు. వక్ఫ్ భూముల సవరణ చట్టం ఇది కేవలం సవరణ మాత్రమే కాదని దేశంలో ఉన్నటువంటి వక్ఫ్ ఆస్తులను వారి సానుభూతిపరులకు ధారాదత్తం చేయడం కోసం కుట్ర అన్నారు.

విహారయాత్రలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలి

● ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విహారయాత్రలకు వెళ్ళేవారు సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. పోలీసులకు సమాచారం ఇస్తే ఇంటిపై నిరంతర నిఘా ఉంచుతారన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో, ఇతర సురక్షితమైన ప్రదేశాల్లో భద్ర పర్చుకోవాలన్నారు. నేరాలను కట్టడి చేయటంలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుంది కాబట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానస్పదంగా ఎవరైన సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంటుందన్నారు. ఇంటిలోపల, బయట లైట్లు వేసి ఉంచాలన్నారు. రాత్రి సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఆరుబయట నిద్రించవద్దన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. చోరీలు జరగకుండా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

శ్మశానానికి బాట మంజూరు చేయాలి

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి బాట సౌకర్యం కల్పించే విధంగా చూడాలని కోరుతూ బాపట్ల పట్టణంలోని ఆనంద నగర్ దళిత క్రైస్తవులు గురువారం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. 5 దశాబ్దాల క్రితం సూర్యలంకరోడ్డులోని బైపాస్ పక్కనే 35సెంట్ల భూమిని శ్మశానానికి ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఆనందనగర్ దళిత క్రైస్తవులు ఆ భూమిలో ఖననం చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుత జనాభా పెరగటం వల్ల శ్మశాన భూమి సరిపోవటంలేదన్నారు. ముఖ్యంగా బైపాస్ నుంచి శ్మశానంలోకి వెళ్లేందుకు దారి కూడా లేదన్నారు. శ్మశాన భూమిని చుట్టుపక్కలవారు ఆక్రమించుకోగా మిగిలిన కొద్ది భూమిలో శవాలను ఖననం చేస్తున్నామన్నారు. ఈ సమస్యలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బాట మంజూరు చేసేవిధంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక, మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, దళిత నాయకులు కొరగంటి శ్యామ్, ఆనందనగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో శనివారం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జే రాజాదెబోరా తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, దళిత నాయకులు ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని ఆమె కోరారు.

మీ భూమి మీ హక్కు రీసర్వేపై అవగాహన ర్యాలీ



భట్టిప్రోలు రీ సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ సుశీల, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబు తదితరులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మీ భూమి మీహక్కు రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. భట్టిప్రోలులో గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ టి.సుశీల గ్రామ పురవీధుల్లో ర్యాలీలో అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూయజమానుల సంతృప్తే ధ్యేయంగా రీసర్వే విధానాన్ని సమూలంగా మార్చి నూతన విధానంలో భూరీసర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ర్యాలీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి టి.సాయిబాబా, డీటీ ప్రసన్న, ఆర్ఐ తన్నీరు ఫణికుమార్, జేఏ శ్రీనివాస్, వీఆర్వో కాళికృష్ణ, కార్యదర్శి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

● **చుండూరు, (ఆంధ్రజ్యోతి)** : భూముల రీసర్వే ద్వారా భూరికార్డుల్లో స్పష్టత ఏర్పడుతుందని తహసీల్దార్ డి.నాగరాజు తెలిపారు. గురువారం భూముల రీసర్వేపై చినపరిమిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో భూముల సర్వే జరిగింది. అనంతరం పూర్తి సర్వే లేకపోవడం వల్ల వాస్తవంగా ఉన్న కొలతలకు, రికార్డుల్లో కొలతలకు తేడాలు ఉన్నాయన్నారు. రైతులందరూ రీ సర్వేకి సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ కాశీం, గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● **పిట్టలవానిపాలెం, (ఆంధ్రజ్యోతి)**: మండలంలోని పోతనకట్టవారిపాలెంలో రీసర్వేలో భాగంగా గురువారం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామసర్పంచ్ యెనుముల పార్వతి, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు.

● **నగరం, (ఆంధ్రజ్యోతి)**: గత ప్రభుత్వంలోని సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ ప్రస్తుతం రీసర్వే జరుగుతుందని నగరం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. గురువారం నగరం మండలంలోని తోటపల్లి, ఈదుపల్లి గ్రామపంచాయతీలను పైలెట్ ప్రాంతాలుగా గుర్తించి రీసర్వే ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు విఫలం


● ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు



మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

కర్లపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి పండించిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటంలో అధికారులు పూర్తి స్థాయిలో విఫలమయ్యారని మండల పరిధిలో పచ్చిమిరప సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరకల్పించలేకపోయారని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరిగిన మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు తాండ్ర సాంబశివరావు కూడా హాజరయ్యారు. రైతుల సమస్యల గురించి అధికార యంత్రాంగాన్ని సర్వసభ్య సమావేశంలో నిలదీశారు. సాంబశివరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు సక్రమంగా జరుగుతున్నప్పటికీ బాపట్ల నియోజకవర్గంలో మాత్రం ధాన్యం కొనుగోలు చేసే విషయంలో అధికార యంత్రాంగం రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారని, ధాన్యం కొనే నాధుడే లేరని సాంబశివరావు మండిపడ్డారు. అధికారులు తప్పించుకునే దోరణిలో వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టార్గెట్ పూర్తయింది. అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, సర్పంచులు అంకమ్మ, గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ, అక్కల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, ఎంఈవో టీయూ మనోరంజని తదితరులు పాల్గొన్నారు.

నేల సజీవంగా ఉంటేనే మొక్కలు ఫలవంతంగా పెరుగుతాయి



వర్మికంపోస్ట్ యూనిట్‌లను చూపించి అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి తదితరులు

● అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేల సజీవంగా ఉంటేనే మొక్కలు ఫలవంతమైన ప్రయోజనాన్ని రైతులకు చేకూరుస్తాయని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. కళాశాలలో వ్యవసాయ వ్యర్థా నిర్వాహణపై అవగాహన, సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అసోసియేట్ డీన్ మాట్లాడుతూ నేలను సజీవంగా ఉంచుకోవాలంటే పర్యావరణ సమతుల్యతను కాపాడుకుంటూ వ్యవసాయ వ్యర్థాలను పునర్వినియోగించుకోవాలని చెప్పారు. ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ కళాశాల సేద్య శాస్త్రవిభాగంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అనంతరం క్షేత్ర సందర్శన ద్వారా వర్మికంపోస్ట్ యూనిట్‌లను చూపించి అవగాహన కల్పించారు. వానపాముల ఎరువుతో భూసారాన్ని పెంచుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో కొండుబొట్లపాలెం గ్రామానికి చెందిన రైతులు, సేద్య విభాగాధిపతి కె.చంద్రశేఖర్, కోఆర్డినేటర్ కె.సుశీల, బి.సురేష్‌కుమార్, డీవీఎస్. అక్షయ్, వై ఎర్రనాయుడు, బి.మౌనిక, బి.రాజ్యలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో శ్మశాన వాటిక శుభ్రం

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఈస్టర్ వేడుకల్లో భాగంగా గురువారం చెంగల్రాయుడుతోటలోని శ్మశాన వాటికను శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చొరవతో స్థానిక నాయకులు దగ్గర ఉండి మున్సిపల్ శానిటరి కార్మికుల ద్వారా సమాధులతోటను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, టీడీపీ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి ఝాన్సీరాణి, అడే వంశీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పీ-4 జగన్‌కు మోసంలా కనిపిస్తుంది

బాపట్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తూ పీ-4 పథకానికి శ్రీకారం చుడితే మాజీ సీఎం జగన్మోహనరెడ్డికి మోసంలా కనిపించటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మార్గదర్శకులుగా తమ ఆదాయవనరుల నుంచి స్వచ్ఛందంగా కొన్ని కుటుంబాలకు అండదండలు అందించి బంగారు కుటుంబాలుగా మార్చేందుకు పీ-4 పథకం తీసుకువచ్చారన్నారు. ఇందులో కూడా మోసం, దగా జగన్ లాంటి జాదులకే కనిపిస్తుందన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ సర్వేను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం బాపట్ల, చీరాల అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఎన్‌సీడీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ నూరుశాతం క్వాలిటిగా సర్వే నిర్వహించాలన్నారు. ఎండలు పెరుగుతున్న కారణంగా ప్రతి పీహెచ్‌సీలోను సచివాలయంలోను ఓఆర్ఎస్ కార్నర్ పెట్టాలని చెప్పారు. ఎండదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను తొలగించాలి

● రామచంద్రపురం మత్స్యకారులు

బాపట్లరూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరప్రాంత నియంత్రణ జోన్ సీఆర్‌జెడ్ 3బీకి లోబడి 200మీటర్ల నోడెవలప్‌మెంట్ జోన్‌లో నిర్మించిన వివిధ నిర్మాణాలను తొలగించాలని అడవి పంచాయతీ రామచంద్రపురం మత్స్యకారులు తెలిపారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మా గ్రామపరిధిలో నియంత్రణజోన్ నియమాలను ఉల్లంఘించి నిర్మించబోతున్న భవనాలు, వివిధ కట్టడాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల నిర్మాణాలను నిలిపివేయాలన్నారు. 250 కుటుంబాలవారికి ప్రభుత్వం రక్షణ కల్పించి సముద్రంపై వేట చేసుకునే అవకాశంపాటు బోట్లు పెట్టుకునే భూభాగాన్ని, చేపలు ఎండపెట్టుకునే భూభాగాన్ని అక్రమణదారుల చెర నుంచి విడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నామని తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవం

● పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్యే నరేంద్రవర్మను శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామివారి తిరునాళ్లకు ఆహ్వానించి తీసుకెళుతున్న మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి

కర్లపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏట్రవారిపాలెంలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను గ్రామపెద్దలు, గ్రామస్థులందరు ఘనంగా నిర్వహించుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లకి నరేంద్రవర్మ ఏట్రవారిపాలెంకు రాగా మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి తన అనుయాయులతో సాదరంగా ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రజలంతా ఐకమత్యంతో కలిసుండాలని ఏట్రవారిపాలెం గ్రామాభివృద్ధి దిశలో నడవాలని నరేంద్రవర్మ స్వామివారిని వేడుకున్నారు. ఏట్రవారిపాలెం, కర్లపాలెం పురవీధుల్లో గ్రామస్థులు జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మకు పురోహితులు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, చీరాల శ్రీనివాసరెడ్డి, మద్దాల మునలయ్య, పిట్ల వసంతరెడ్డి, అంజిరాజు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యాన్ని పొందేందుకు ఇబ్బందులు పడుతున్న కుటుంబాలవారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చేయూతనందించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గురువారం బాధిత కుటుంబాలవారికి చెక్కులు అందజేసి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పట్టణంలోని ప్యాడిసన్ పేటకు చెందిన మల్లెల సునీతకు రూ.2,00,804లు, చెట్టుపల్లి వందనంకు రూ.89,022, దగ్గుమల్లివారిపాలెంకు చెందిన షేక్ కరీమున్నీసాకు రూ.70,001, ఉప్పరపాలెంకు చెందిన రాజురాంబాబురెడ్డికి రూ.62,983, ఇమ్మడిశెట్టివారిపాలెంకు చెందిన చాపల వెంకాయమ్మకు రూ.51,311, కాట్రగడ్డ సూర్యకు రూ.40వేలు చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కె.రమేష్‌బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన వీధుల్లో చెత్తనిల్వలు ఉండరాదు

● మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన వీధుల్లో చెత్తనిల్వలు లేకుండా చూడాలని శానిటరి సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన 2వవార్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర నుంచి డ్రైనేజీలలో సిల్ట్ తీసే పనులను పరిశీలించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీరు సరఫరా విషయమై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు వార్డుల్లో తిరుగుతూ తాగునీటి సరఫరాలో తలెత్తే ఇబ్బందులు గుర్తించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే ట్రిప్‌షీట్‌ను తనిఖీ చేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా అయ్యేలా తప్పక చూడాలన్నారు. అనంతరం అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు.

స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ కట్టా మంగా

రేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దే విధంగా కార్మికులు విధులు నిర్వహించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టామంగా అన్నారు. గురువారం పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా కార్మికులు విధులు నిర్వహించాలని ప్రజల అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమలో వైస్‌ఛైర్మన్‌లు కాశీవిశ్వనాథగుప్తా, జీ ప్రశాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు శ్రీరామ విద్యార్థుల ఎంపిక




జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో తులసి విష్ణుప్రసాద్

కొల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 17వ జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు శ్రీరామ రూరల్ అకాడమీ ఛైర్మన్ కొలసాని తులసి విష్ణుప్రసాద్ గురువారం తెలిపారు. మండలపరిధిలోని శ్రీరామ రూరల్ విద్యాసంస్థలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 4వ నుంచి 7వ తేదీ వరకు జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు ఎన్ ధర్మతేజ, పి.హేమప్రకాష్, ఎం ఈశ్వర మణికంఠ, ఏ చైతన్య, కె.దేవసింహలు ఎంపికైనట్లు తెలిపారు. 19 రాష్ట్రాలు ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నాయని ఆంధ్రప్రదేశ్ తరపున ఈ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికవడంతో ఆయనతో పాటు ప్రిన్సిపల్ ఉమారాణి, హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయుల బృందం తమ అభినందనలు తెలియజేసింది.

జలకాలాటలలో..

వేసవి నుంచి ఉపశమనం పొందడానికి యువకులు, విద్యార్థులు పంట కాలువల్లో ఈతకొడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు... ఈతల్లో విన్యాసాలు చేస్తూ ఆనందోత్సాహాలతో మై మరిచిపోతున్నారు.... స్థానిక బుడంపాడు రోడ్డులోని గుంటూరు చానల్‌లో ఇలా ఈతకొడుతున్నారు. -గుంటూరు (ఆంధ్రజ్యోతి)








అరచేతిలో పుర సేవలు

పురమిత్ర యాప్‌తో సులభంగా సమస్యల పరిష్కారం



సత్తెనపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని సమస్యలు వెంటనే పరిష్కారం కావటం లేదు. రోజుల తరబడి సమయం పడుతుంది. దరఖాస్తు చేయాలంటే పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్ళాలి. గంటల తరబడి వేచి ఉండి అర్జీలు అందించాలి. ఇటువంటి తరుణంలో ప్రజల సమస్యలు సులభంగా పరిష్కరించుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అరచేతిలో పుర సేవలు పొందేలా ప్రభుత్వం పుర మిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు ఇంట్లోనే కూర్చొని పురపాలక సేవలు పొందేలా వీలు కల్పించింది. ఈ యాప్‌లో పలు రకాల సేవల వల్ల పట్టణంలో 50వేల మంది సులభంగా సేవలు పొందవచ్చు. సమస్యకు సంబంధించిన చిత్రాన్ని తీసి ఫోన్ పెట్టి వాయిస్ రికార్డుల్లో పంపాలి. సమస్య సమాచారం సంబంధిత విభాగం అధికారికి చేరుతుంది. కనీసం మూడు నుంచి 30 రోజుల లోపు పరిష్కరిస్తారు.

ప్లే స్టోర్‌లో

పుర మిత్ర యాప్‌ను గుగూల్ ప్లే స్టోర్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీనిని నేరుగా డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ కావచ్చు. రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్, అకౌంట్స్, పరిపాలన విభాగాలకు సంబంధించిన 150 రకాల పౌర సేవలను పొందు పరిచారు. ఇతర ప్రాంతాల్లో స మస్యనైనా అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు. ప్రజలు పంపిన సమస్యలను అధికారులు సకా లంలో పరిష్కరించాలి. ఏం చర్యలు చేపట్టారో ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వినతి పరిష్కారంలో పురోగతి సమీక్షించు కోవచ్చు. అధికారి స్పందించక పోతే పైస్థాయి అధికారికి చేరుతుంది. అక్కడి నుంచి అపరిష్కృత జాబితాలో పడుతుంది. సంబంధిత అధికారిని బాధ్యుడిని చేస్తారు.

సమస్య ఏదైనా...

సమస్యలను ప్రజలు అధికారులకు తెలియ జేసేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్ళాల్సిన అవసరం లేదు. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి ఏ సమస్యనైనా ఈ యాప్ ద్వారా తక్షణం అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు. జనన, మరణ ధ్రువ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, లైసెన్స్ రెన్యువల్, సీనరేజ్ పన్ను, లీజ్ అండ్ అగ్రిమెంట్ ఫీజు వంటివి ఇందులో పొందవచ్చు.

మూడేళ్లయినా.. తప్పటడుగులే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితి చాలా మంది అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయా లకు నేటికి కనీసం పర్నిచర్ కూడా ఇవ్వలేదు. కార్యాలయాలకు కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేనా..

గత ప్రభుత్వం ఆదరాబాదరాగా జిల్లాలు ఏర్పాటు చేయడంతో అనేక సాంకేతికపరమైన చిక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ విభాగానికీ న్యాయం చేయడంలేదు. సరిపడా సిబ్బంది లేకపోవడం, ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని ఖాతాలు నిర్వహిస్తున్నారు. మెప్మా, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, యువజన సర్వీసుల వంటి విభాగాలన్నీ ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. కొన్ని విభాగాలకు చెందిన అధికారులకు అయితే గుంటూరులోని ప్రధాన కార్యాలయాల నుంచే జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా అధికారులు లేక అధికారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా ఏర్పాటు సమయంలో సాంకేతికంగా ఉన్న చిక్కులను తొలగించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా జిల్లా పోస్టుల భర్తీకి ప్రతిబంధకంగా ఉన్నట్లు సమాచారం. కార్యాలయాల్లో సిబ్బం ది అయితే ఉండాల్సిన నిష్పత్తిలో ఏ ఒక్క విభాగంలోనూ లేరు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ఆచరణలో రాకపోగా పలు ప్రభుత్వ విభాగాలకు అద్దె భవనాలే ఇప్పటికీ దిక్కుగా ఉన్నాయి. ఇలాంటి ఎన్నింటినో సరిచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ప్రణాళిక లేకుండా వైసీపీ కొలువుదీర్చిన జిల్లాలను గాడిలో పెడతామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హా మీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మెరుగుపడతాయని అటు యంత్రాంగం, ఇటు ప్రజలు ఆశించారు. అయితే పది నెలలైనా జిల్లా సమస్యలపై ప్రభుత్వం విధానాన్ని ప్రకటించలేదు. అయితే ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. కొత్త జిల్లాల అధికారులకు పూర్తి పాలనా పరమైన వెసులుబాటు కల్పించడంతో పాటు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఎప్పటికి సమస్యలు పరిష్కారమవుతాయో చూడాలి.

ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్తకు సీఎం ప్రశంస



సీఎం చంద్రబాబుతో ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్త, మ్యాగ్నమ్ వింగ్స్ సీఈవో అభిరామ్ చావా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్త, మ్యాగ్నమ్ వింగ్స్ సీఈవో అభిరామ్ చావాను సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. సీఎం చంద్రబాబును అభిరామ్ చావా గురువారం సచివాల యంలో కలిశారు. తాను ఆవిష్కరించిన ఎయిర్ ట్యాక్సీ గురించి సీఎంకు వివరిం చారు. ఎయిర్ ట్యాక్సీలు గుంటూరులో తయారు కావటం పట్ల చంద్రబాబు నాయుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎయిర్ ట్యాక్సీ వివరాలు, సెక్యూరిటీ ఫీచర్స్ తయారీకి అయిన ఖర్చు వంటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెండుసీట్ల సామర్థ్యంతో ఈ ఎయిర్ ట్యాక్సీని తయారు చేశానని అభిరామ్ వివరించారు. ఉన్నత స్థాయి చదువులు చదివి దేశానికి సేవ చేసేందుకు ముందుకు వచ్చిన అభిరామ్ నేటి యువతరానికి స్ఫూర్తి దాయకం అని సీఎం అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సివిల్ ఏవియేషన్ అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా కేంద్రంతో మాట్లాడి సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.. ఈ పరిశోధనలు కొనసాగించాలని అభిరామ్‌కు సీఎం సూచించారు.

రాజమండ్రి చిత్ర కళా వీధికి తెనాలి శిల్పాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో అమరావతి చిత్ర కళా వీధి పేరుతో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనకు తెనాలి శిల్పాలు తరలిను న్నాయి. తెనాలి ఆర్ట్స్ గ్యాలరీలో ప్రదర్శిస్తున్న వినూత్న శిల్పాలను ఇందుకోసం



శిల్పులు రూపొందించిన శిల్పాలు

ఎంపిక చేశామని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వినూత్న శిల్పాలను విశ్రాంత ఎస్పీ సత్యనారాయణమూర్తి, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం సందర్శించారు. గ్యాలరీలో ఏర్పాటు చేసిన పలు శిల్పాలను సందర్శించి శిల్పులను అభినందించారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శనలో 500లకు పైగా ఆర్ట్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పనికి రాని ఇనుప వస్తువులతో రూపొందించిన సింహం, పులి, జింక, తేలు, నెమలి వంటి పలు శిల్పాలను ప్రదర్శనలో పెట్టనున్నట్లు శిల్పులు శ్రీహర్ష, రవిచంద్ర తెలిపారు.

ఇసుక రీచ్‌లకు టెండర్లు నిర్వహించాలి

● డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు లభించిన ఇసుక రీచ్‌లకు త్వరగా టెండర్లు నిర్వహించి ఏజెన్సీలను ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మైనింగ్ అధికారులు ఆదేశించారు. ఆ వెంటనే ఇసుక తవ్వకాలు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇసుక కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో రాయపూడిలో పూడిక తొలగింపు పనులను బోట్స్‌మెన్ సొసైటీకి కేటాయించడం, బొమ్మువానిపాలెం-16 ఓపెన్ ఇసుక రీచ్, గుండిమెడ ఓపెన్ శాండ్ రీచ్, కృష్ణానదిలో హైడ్రోగ్రాఫిక్



కలెక్టరేట్‌లో జరిగిన డీఎల్ఎస్‌సీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

సర్వే నిర్వహణ, అబ్బరాజుపాలెం/బోరుపాలెం, లింగాయపాలెం అండ్ రాయపూడి, తాళ్లాయపాలెంలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం అంశాలపై చర్చించారు. రాయపూడి డీసిల్టేషన్ పాయింట్ పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో రాష్ట్ర మైనింగ్ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని మైనింగ్ అధికారిని ఆదేశించారు. బొమ్మువానిపాలెం - 16 ఓపెన్ ఇసుక రీచ్ మైనింగ్ ప్లాన్‌ను రూపొందించి టెండర్ షెడ్యూల్‌ని సిద్ధం చేయాలన్నారు. ఈ రీచ్ 21.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. మైనింగ్ ప్లాన్ మెస్సర్స్ జియో మైనింగ్ సర్వీసెస్ రూపొందించినందున రాయల్టీ ఇన్‌స్పెక్టర్ దానిని తెప్పించి ఆమోదం తీసుకోవాలన్నారు. గుండిమెడ రీచ్‌కు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బిడ్‌లు ఆహ్వానించి ఏప్రిల్ 16వ తేదీ నాటికి అర్హత గల ఏజెన్సీని ఎంపిక చేయాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇసుక నిల్వలు అంచనా వేసేందుకు హైడ్రో గ్రాఫిక్ సర్వే కోసం ఈఈ, కేసీ కెనాల్ డివిజన్‌కు జిల్లా వాటా కింద రూ. 24 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరా చేసే కేంద్రాల వద్ద పర్యవేక్షణ కోసం సంబంధిత తహసీల్దార్ల ద్వారా రెవెన్యూ ఉద్యోగులను మైనింగ్ అధికారులు నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ, డీఆర్వో ఎస్ఎస్‌కే కాజావలి, మైనింగ్ జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి నాగిని, ఆర్‌టీవో జీఎస్ ప్రసాదు, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీమ బేగం, తహసీల్దార్లు సిద్ధార్థ, సీతారామయ్య, సునీత పాల్గొన్నారు.

పల్నాడులో.. అకాల వర్షం



గురజాల మండల పరిధిలో మిర్చి పంటపై కప్పిన పట్టలు

గురజాలటౌన్, మాచర్లటౌన్, వెల్దుర్తి, మాచవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గురువారం ఉన్నట్లుండి వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు చినుకులు పడగా మరికొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా కారు మబ్బులు కప్పి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మిర్చి పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురవడంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. ఒకవైపు దిగుబడి తగ్గి, మరోవైపు గిట్టుబాటు ధర కూడా లేక ఆవేదనతో ఉన్న రైతులను అకాల వర్షం మరింత ఆందోళనకు గురి చేసింది. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయలు తాలుకాయలుగా మారితే ఎవరూ కొనరని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసుకున్న రైతులు మిర్చిని కల్లాలకు చేర్చుకున్నారు. కల్లాల్లోని దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పట్టల కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది. కొంత మంది రైతులకు పట్టలు కప్పే సమయం లేకపోవడంతో వర్షం నీటితో మిర్చి తడిసిపోయింది. పలు ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు పారింది.

- మాచర్ల ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం గంటకుపైగా పడింది. పొలాల్లో మిర్చి కోతలు కోసేందుకు వచ్చిన వ్యవసాయ కూలీలు తడిసి ముద్దయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చిని తరలించేందుకు వచ్చిన లారీలు కూడా పొలాల్లోనే నిలిచిపోవాల్సి వచ్చింది.
- వెల్దుర్తి మండల పరిధిలో ఈదురు గాలులతో కురిసిన వర్షం రైతులను హడలెత్తించింది. గాలుల ఉధృతికి కల్లాలపై పట్టలను కప్పడానికి రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.
- మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం తదితర గ్రామాల్లో సాయంత్రం నాలుగు నుంచి 5 గంటల మధ్యలో చిరు జల్లులు కురిశాయి.పొలాల్లో ఆర బోసిన మిర్చి, మొక్క జొన్న, పొగాకు దిగుబడులను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.



వెల్దుర్తి మండలంలో వర్షంతో తడిచిన మిర్చి

ఉండవల్లిలో.. మన ఇల్లు - మన లోకేశ్

● ఎన్నికల హామీకి శ్రీకారం చుట్టిన మంత్రి ● గోవిందు కుటుంబానికి తొలి పట్టా పంపిణీ



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో మంగళగిరిలో లోకేశ్ గెలిస్తే ఇల్లు పీకేస్తారని ప్రచారం చేశారు.. అలా ప్రచారం చేసిన వారే అధికారం చేపట్టిన తర్వాత మంగళగిరి పరిధిలో చాలా ప్రాంతాల్లో ఇళ్ల కూల్చేసి పలువురిని నిరాశ్రయులను చేర్చారు. ఈ క్రమంలో మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న దశాబ్దాల సమస్యకు పది నెలల్లో మంత్రి లోకేశ్ పరిష్కారం చూపారు. మన ఇల్లు - మన లోకేశ్ పేరుతో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న మూడు వేల మందికి శాశ్వత పట్టాలను లోకేశ్ అందజేయనున్నారు. ఈ క్రమంలో తొలుత గురువారం ఉండవల్లి గ్రామం అమరారెడ్డినగర్‌లోని రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి ఇంటికి వెళ్లిన లోకేశ్ స్వయంగా మొదటి శాశ్వత ఇంటి పట్టాను అందజేశారు. దంపతులకి నూతన వస్త్రాలతో పాటు ఇంటి పట్టాను అందించారు. కొద్దిసేపు వారితో ముచ్చటించి, చిన్నారులను ఎత్తుకొని ఆడించారు. స్వయంగా తమ ఇంటికి వచ్చి శాశ్వత ఇంటి పట్టా అందజేయడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఆ కుటుంబసభ్యులు లోకేశ్‌కు పాయసం ఇచ్చి ఆనందాన్ని పంచుకున్నారు.

మా చిత్తశుద్ధికి నిదర్శనం

గతంలో చెప్పినట్లుగానే మొదటి పది నెలల్లోనే పేదలకు శాశ్వత పట్టాలు ఇవ్వడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టా విలువ రూ.9.5 లక్షలన్నారు. అటవీ భూముల్లోని నివాసితులకు కొంత సమయం పడుతుందన్నారు. 150 గజాలలోపు మొదటి విడత ఇస్తున్నామన్నారు. రెండో విడతలో రైల్వేవి ఉంటాయని చెప్పారు. ఉండవల్లి పెనుమాక గ్రామాలలో భూగర్భ డ్రైయినేజి, కరెంటు ఇతర సదుపాయాలు, అమరావతి డెవలప్‌మెంట్ కింద చేస్తామన్నారు. కామన్ ఫెసిలిటి సెంటర్ జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్క్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. త్వరలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛతలో మంగళగిరిని దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. కుప్పం, హిందూపురం మాదిరి మంగళగిరిని టీడీపీకి కంచుకోటలా మారుస్తామన్నారు. అంతకముందు లోకేశ్ తమ ప్రాంతానికి రాగానే పలువురు మహిళలు దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.



రాజమండ్రి గోవిందు కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



కొంగపాడుడొంక వద్ద పాత స్తంభాల పక్కనే ఏర్పాటు చేస్తున్న కొత్త విద్యుత్ స్తంభాలు

మళ్లీ అదే పొరపాటు

- పాత విద్యుత్ లైన్‌ల స్థానంలో కొత్తవి
- టవర్‌లను ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సమస్యలుండవని అభిప్రాయం
- కేబుల్ వైర్ల తొలగింపుపై ఆందోళన

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పాత విద్యుత్ లైన్‌ల స్థానంలో పలు చోట్ల కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే విద్యుత్ లైన్‌లు నామ్ రోడ్డు క్రాస్ చేసే ప్రాంతంలో ఎత్తైన టవర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సమస్యలు లేకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అయితే కొత్త లైన్‌లు ఏర్పాటు చేస్తూ కూడా పాత విద్యుత్ స్తంభాల ఎత్తులోనే మరలా కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రయోజనం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో ఆయా ప్రాంతాలలో కేబుల్ వైర్‌లు తొలగించకుండా కట్ చేస్తుండడంతో కేబుల్ ఆపరేటర్‌లు ఆందోళన చెందుతున్నారు. కేబుల్ వైర్‌లు కట్‌చేయడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏయే ప్రాంతాలలో ఎప్పుడు కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారో ముందస్తు సమాచారమైన ఇస్తే తొలగించుకునే వీలుంటుందని కేబుల్ ఆపరేటర్‌లు తమ ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు.

డీజిల్ చోరీపై వాగ్వివాదం

యువకులను హెచ్చరించిన సీఐ



యువకులను హెచ్చరిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్లలో డీజిల్ చోరీపై డ్రైవర్‌లు, యజమానుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. విజయవాడ - బెంగళూరు హైవే నిర్మాణ పనులకు అద్దంకి పట్టణానికి చెందిన వ్యక్తులు టిప్పర్‌లను ఏర్పాటు చేశారు. తాళ్లూరు మండలం గుంటిగంగ వద్ద టిప్పర్‌లు గ్రావెల్ తరలింపునకు ఉంచగా, డ్రైవర్‌లు డీజిల్ దొంగలించి అమ్ముకుంటున్నట్లు యజమానులకు సమాచారం అందింది. దీంతో గురువారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని మేదరమెట్ల రోడ్డులో టిప్పర్‌ల యజమానులు, డ్రైవర్‌లు వాగ్వివాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకొని హెచ్చరించి పంపించివేశారు.

కూలీల ఆటోను ఢీకొన్న పొట్టు లారీ

ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు



ప్రమాదానికి కారణమైన పొట్టు లారీ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా పొట్టు లారీ ఢీకొనటంతో 5 గురు మహిళా కూలీలకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన మహిళా కూలీలు మిర్చి కోతలకు ఆటోలో అద్దంకి వైపు వస్తున్నారు. అద్దంకి పట్టణానికి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద గురువారం ఉదయం ఎదురుగా వస్తున్న పొట్టు లారీ అంచు బయటకు ఉండడంతో కూలీల ఆటోను తగిలింది. దీంతో ఆటోలో ఉన్న నాగిపోగు మరియమ్మ, జంద్రాజుపల్లి కోటేశ్వరమ్మ, ఎం. మరియమ్మ, బిరుదు చిట్టెమ్మ, మురికిపూడి శ్రీదేవికి గాయాలు కావడంతో అటు వైపు వస్తున్న మరో ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగిపోగు మరియమ్మ, జంద్రాజుపల్లి కోటేశ్వరమ్మ లను ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అక్కయ్యపాలెం కాలువ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.17వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆటోలు, మినీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బాపట్ల జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు హెచ్చరించారు. కారంచేడు గ్రామంలో గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఓవర్ లోడ్ ప్రయాణికులతో వెళ్తున్న 3 ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి కూలీలకు అవగాహన కల్పించారు. సీజ్ చేసిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అడ్డంగా దొరికారు

- ఆర్డీవో కారుకు సైడ్ ఇవ్వకుండా అసౌకర్యం కలిగించిన ఇసుక అక్రమ టిప్పర్
- అనుమానంతో తనిఖీ
- అనుమతులు లేకపోవడంతో వాహనం ఈపూరుపాలెం స్టేషన్‌కు తరలింపు


కావూరివారిపాలెం (చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కారుకు సైడు ఇవ్వకపోవడంపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం తెలుసుకొని చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కావూరివారిపాలెంలో ప్రభుత్వ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో డ్రైవర్‌తో సహా వెళుతున్నారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లి - చీరాల మండలం కావూరివారిపాలెం మధ్యలో ఆర్డీవో కారు వెళ్తుండగా వెదుళ్లపల్లి వైపు నుంచి గవినివారిపాలెం వైపు వెళుతున్న టిప్పర్ కొద్ది నిముషాలు ఆర్డీవోకు సైడ్ ఇవ్వకుండా అసౌకర్యం కలిగించింది. అప్పటికే కొన్నిసార్లు ఆర్డీవో డ్రైవర్ హారన్ ఉపయోగించినా ప్రయోజనం లేకపోవడంతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అసహనానికి గురయ్యారు. దీంతో టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసి నిలదీశారు. అంతలోనే చాకచక్యంగా వ్యవహరించిన ఆర్డీవో అసలు టిప్పర్ ఏమిటని ఆరా తీయగా.. అది ఇసుక అక్రమ రవా ణా సాగిస్తున్న వాహనంగా గుర్తించారు. వెంటనే సిబ్బంది సహాయం తో టిప్పర్‌ను ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంటే మీరే మి చేస్తున్నారంటూ వీఆర్వో తదితర రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఈపూరుపాలెం పోలీసులు టిప్పర్‌కు చలానా విధిం చి పంపనున్నట్లు సమాచారం.



ఈపూరుపాలెం పోలీసుల అదుపులో ఉన్న ఇసుక టిప్పర్

నేడు మంత్రి గొట్టిపాటి అర్జీల స్వీకరణ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 8-45 గంటలకు బల్లికురవ మండలం వేమవరం వద్ద హరిబాలాజీ గ్రానైట్స్ ప్రారంభించనున్నారు. ఉదయం 9-30 గంటలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదువుతున్న 300 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. అనంతరం 10-30 గంటల నుంచి అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి మంత్రి రవికుమార్ అర్జీలను స్వీకరించనున్నారు.



నామ్ రోడ్డులో వెలగని సెంట్రల్ లైటింగ్ లైట్లు

అద్దంకిలో సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నల్లవాగు నుంచి శింగరకొండ సమీపంలోని 99 అడుగుల విగ్రహం వరకు నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ కొంత దూరం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొంత దూరం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ నిర్వహణ కూడా అటు నామ్ నిర్వహణ సంస్థ, అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తరచూ లైట్లు మొరాయిస్తుండడంతో చీకటిగా మారుతుంది. అద్దంకి పట్టణ పరిధిలో తరచూ చీకటిగా ఉంటుండడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంటర్ లైటింగ్ లైట్లు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పరదాలు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద బారులు తీరిన రైతులు

అన్నదాతల ఉరుకులు.. పరుగులు

- వర్ష సూచనతో పంటలను రక్షించుకునేందుకు పాట్లు
- పరదాల కోసం దుకాణాల వద్ద బారులు

పర్చూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) 3 : మారిన వాతావరణ పరిస్థితులు వర్షపు హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు కలవరానికి గురవుతున్నారు. చేతికి అందివచ్చిన పంటలను రక్షించుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గురువారం ఒక్కసారిగి వాతావరణ పరిస్థిలు మారడంతో పొలంలోనే ఉన్న పంటలను కాపాడుకునేందుకు పరదాల కోసం దుకాణాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలో వేల ఎకరాల్లో సాగుచేసిన వైట్‌బర్లీ అధిక శాతం పొలాల్లోనే ఎండపెట్టారు. మిర్చి ఎక్కువ భాగం కల్లాల్లోనే ఉండగా, మరి కొంత మిర్చి కాయలు కోతకు వచ్చి ఉన్నాయి. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. కనీసం చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు వేలకు వేలు వెచ్చించి మరీ పట్టలను కొనుగోలు చేసుకుంటున్నారు. ఒకపక్క రైతుల్లో ఆందోళన నెలకొని ఉంటే మరోపక్క వ్యాపారులు అధిక ధరలు పెంచి పట్టలు అమ్ముతూ జోష్‌గా ఉన్నారు.

రేపు పుట్టంరాజుకు సన్మానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికు ఈ నెల 5వ తేదీన ఉదయం 10గంటలకు చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సత్కార సభ జరుగుతుందని నిర్వాహకు లు గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలో సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



అంజమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

అంజమ్మకు ఏలూరి నివాళి

ఇంకొల్లు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ వజీఈ సభ్యుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజి వెంకట్రావు మాతృమూర్తి అంజమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. గురువారం ఇంకొల్లు ప్రాంతంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, కరి శ్రీను, మార్క్, శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ బిల్లును ఆమోదించడం అన్యాయం



నిరసనలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : లోక్ సభలో పాత పెన్షనర్స్ ప్రయోజనాలను విస్మరించి ఫైనాన్స్ బిల్లును ఆమోదించడం అన్యాయమని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. గురువారం చీరాల శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వృద్ధులపై నిర్లక్ష్యం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, బొయాజ్, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఐజాక్, యోహాను, లింగారావు, కిషోర్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు సభ

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) చదువుతున్న విద్యార్థులకు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. అవలంబించిన విద్యతో భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతనం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీఎస్ రావు, మేనేజర్ రమణమూర్తి పాల్గొన్నారు.

భార్య, అత్తపై కత్తితో దాడి

- అపస్మారక స్థితిలో భార్య, రక్త గాయాలతో అత్త
- భర్త రేపల్లె యడ్లలంక వాసి

పేరాల(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా కుటుంబంలో నెలకొన్న మనస్పర్థల కారణంగా కట్టుకున్న భార్యను, అడ్డు వచ్చిన అత్తను కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం రాత్రి పేరాల్లోని మసీదు సెంటర్ సమీపంలో చోటు చే సుకుంది. బాధిత కుటుంబ సభ్యు లు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పరిధిలోని రేపల్లె యడ్లలంకకు చెందిన తోకల కరుణాకర్, పేరాలకు చెందిన సంధ్య 2013లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఒక బాబు. గత రెండు సంవత్సరాల కిందట నెలకొన్న వివాదాల కారణంగా భార్య సంధ్య తల్లి లక్ష్మి వద్దకు వచ్చేసింది. అయితే అప్పటి నుంచి అప్పుడప్పుడు భర్త కరుణాకర్ భార్య వద్దకు వచ్చి గొడవపడుతుంటాడు. ఈక్రమంలోనే పథకం ప్రకారం కత్తితో భార్య పొట్టలో, తొడపై కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన అత్త లక్ష్మి రెండు చేతులపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. అయితే అపస్మారకంగా ఉన్న భార్యను, తీవ్ర రక్త గాయాలైన లక్ష్మిని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సంధ్యను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ నాగభూషణం హాస్పిటల్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఏరియా హాస్పిటల్లో అపస్మారక స్థితిలో ఉన్న సంధ్య

ప్లాస్టిక్ నిషేధంపై కొనసాగుతున్న ఆంక్షలు

- పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు
- పెద్ద మొత్తంలో స్వాధీనం

పర్చూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో ఇటు ప్రజలకు ఆరోగ్య సమస్యలతోపాటు డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారుతోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. రోడ్లపై, మురుగు కాలువల్లో పెద్ద ఎత్తున కవర్లు కుప్పలుగా కన్పిస్తున్నాయి. వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్‌ను విపరీతంగా వాడుతుండడంతోపాటు ఉపయోగించిన కవర్లను మురుగు కాలువల్లో పడేస్తున్నారు. దీంతో తరచూ మురుగు నీరు కదలక డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. మరోపక్క మురుగు కదలకపోవడంతో దోమల బెడద ప్రజలను పట్టిపీడిస్తోంది. పలు ప్రాంతాల్లో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. పర్చూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిత్యం కాలువలను శుభ్రం చేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఈ సమస్యపై స్పందించిన పం చాయతీ అధికారి మస్తాన్‌రావు నేతృత్వంలోని శానిటరీ అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టా రు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలంటూ ఆదేశాలిచ్చారు. పలు దుకాణాల్లో సోదాలు చేసి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని, అలాగే వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా వస్త్ర సంచులను వినియోగదారులకు అలవాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



సోదాల అనంతరం దుకాణాల్లో దొరికన ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకొని ట్రాక్టర్‌లో కార్యాలయానికి తరలిస్తున్న పంచాయతీ అధికారులు

రామకూరులో అందని ఫైబర్ నెట్ సేవలు

- కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినా లభించని పరిష్కారం
- వినియోగదారుల ఆరోపణ

పంగులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రామకూరు గ్రామంలో ఫైబర్‌నెట్ సేవలు సరిగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజులుగా పగటి పూట నెట్ సేవలు అందక ఇబ్బంది పడుతున్నామని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చెప్తున్నారు. ఫైబర్‌నెట్ ద్వారా నెట్ సేవలు నిరంతరం అందుతాయనే భావనతో రామకూరులో సుమారు 80 మందికి పైగా ఫైబర్‌నెట్ వినియోగిస్తున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధులు నిర్వహించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 15 మందికి పైగా ఉండగా, టీవీ, టచ్ ఫోన్, ఇతర సేవలు వినియోగించుకునే వారు 70 మంది వరకు ఫైబర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నారు. నెల రోజులుగా ఉదయం కొంత సమయం తరువాత నెట్ పనిచేయని పరిస్థితి ఏర్పడిందని కాల్ సెంటర్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా సాంకేతిక సమస్యను గుర్తించి సరిదిద్దే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. పగటి పూట నెట్ సేవలు అందకపోవడంతో వరపర్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగ తమ బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నెలకు రూ.650 ప్యాకేజీని వినియోగిస్తుండగా, మిగిలిన సేవలు పొందేవారు నెలకు రూ.350 ప్యాకేజీని వినియోగిస్తున్నారు. ఫైబర్‌నెట్ ద్వారా నాణ్యమైన సేవలు పొందవచ్చని భావించిన వినియోగదారులు, సాంకేతిక సమస్యలతో స్మార్ట్ ఫోన్‌లు పనిచేయక, పొరుగు ప్రాంతాలకు వెళ్ల లేక అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సమస్యను గుర్తించలేక పోవడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లయినా.. తప్పటడుగులే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితి చాలా మంది అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయాలకు నేటికి కనీసం ఫర్నిచర్ కూడా ఇవ్వలేదు. కార్యాలయాలకు కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేనా

గత ప్రభుత్వం ఆదరాబాదరాగా జిల్లాలు ఏర్పాటు చేయడంతో అనేక సాంకేతికపరమైన చిక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ విభాగానికీ న్యాయం చేయడంలేదు. సరిపడా సిబ్బంది లేకపోవడం, ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని ఖాతాలు నిర్వహిస్తున్నారు. మెప్మా, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, యువజన సర్వీసుల వంటి విభాగాలన్నీ ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. కొన్ని విభాగాలకు చెందిన అధికారులకు అయితే గుంటూరులోని ప్రధాన కార్యాలయాల నుంచే జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా అధికారులు లేక అధికారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా ఏర్పాటు సమయంలో సాంకేతికంగా ఉన్న చిక్కులను తొలగించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా జిల్లా పోస్టుల భర్తీకి ప్రతిబంధకంగా ఉన్నట్లు సమాచారం. కార్యాలయాల్లో సిబ్బంది అయితే ఉండాల్సిన నిష్పత్తిలో ఏ ఒక్క విభాగంలోనూ లేరు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ఆచరణలో రాకపోగా పలు ప్రభుత్వ విభాగాలకు అద్దె భవనాలే ఇప్పటికీ దిక్కుగా ఉన్నాయి. ఇలాంటి ఎన్నింటినో సరిచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ప్రణాళిక లేకుండా వైసీపీ కొలువుదీర్చిన జిల్లాలను గాడిలో పెడతామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మెరుగుపడతాయని అటు యంత్రాంగం, ఇటు ప్రజలు ఆశించారు. అయితే పది నెలలైనా జిల్లా సమస్యలపై ప్రభుత్వం విధానాన్ని ప్రకటించలేదు. అయితే ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. కొత్త జిల్లాల అధికారులకు పూర్తి పాలనా పరమైన వెసులుబాటు కల్పించడంతో పాటు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఎప్పటికి సమస్యలు పరిష్కారమవుతాయో చూడాలి.

వలపర్లలో కూలి డబ్బుల పంపిణీపై వివాదం

మార్టూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పచ్చాకు పనులకు సంబంధించి కూలి డబ్బులు పంచుకునే విషయంలో బంధువుల మధ్య వివాదం జరిగిన ఘటన గురువారం రాత్రి మండలంలోని వలపర్ల గ్రామంలో జరిగింది. ఈ విషయమై వారు డయల్ 100కు కాల్ చేయడంతో, అక్కడ నుంచి స్టేషన్‌కు సమాచారం రాగా, సీఐ ఎం.శేషగిరిరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివాదానికి కారణమైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు.. గత రెండు నెలలు కిందట వలపర్లలోని ఎస్సీ కాలనీకి చెందిన వారు పచ్చాకు పనులు నిమిత్తం నెల్లూరు సమీపంలోని ఒక గ్రామానికి వెళ్లారు. మరలా వారు రెండు రోజులు కిందట పనులు ముగియడంతో నెల్లూరు నుంచి మరలా వలపర్ల గ్రామానికి వచ్చారు. అయితే వారితో పనులు చేయించుకున్న రైతు కూలీల కోసం రూ.2లక్షలు పంపిస్తానని కేవలం రూ.70 వేలను గురువారం పంపించారు. దాంతో రూ.70 వేలు పంచుకునే విషయంలో వారి మధ్య వివాదం జరిగింది. వారిలో ఒకరు 100కు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం వారిని అదుపులోకి తీసుకున్నామని, కాలనీలో ఎలాంటి గొడవలు లేవని, వారికి కౌన్సెలింగ్ చేసి పంపిస్తామని సీఐ శేషగిరిరావు తెలిపారు.

చీరాల మున్సిపాలిటీలో అవిశ్వాసానికి సిద్ధం?

- నిన్న, మొన్నటి దాకా చైర్మన్‌పై వాడీవేడి చర్చ
- గత శుక్రవారం సజావుగా సాగిన బడ్జెట్ సమావేశం
- తాజాగా తెరపైకి అసమ్మతి స్వరం
- ఇప్పటికే తీర్మానంపై టీడీపీ కౌన్సిలర్‌ల సంతకాలు
- మరో రెండు రోజుల్లో కలెక్టర్ దృష్టికి
- చైర్మన్ స్థానంపై మళ్లీ ఆశావాహుల్లో చిగురించిన ఆశలు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై టీడీపీ కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. రెండు మాసాలుగా చీరాల మునిసిపాలిటీలో జరిగిన కౌన్సిల్ సమావేశాలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను గమనిస్తే చాలా వరకు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టనున్నట్లు జోరుగానే ప్రచారం జరిగింది. అయితే ఇటీవల ఆ పరిస్థితిపై అందరూ గుట్టు చప్పుడుకాకుండా ఉన్నారు. పైగా అదే సమయంలో ఇటీవల మునిసిపాలిటీలో వైసీపీ హయాంలో ఆబ్కాస్ ఉద్యోగాల్లో చేరిన వారిని తొలగించే క్రమంలో ఓ రెండు స్థానాలపై ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే బలరాం చరవాణీ ద్వారా సంభాషించుకున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ విధంగా చూసుకుంటే చీరాల్లో చైర్మన్ స్థానంపై అవిశ్వాసం లేనట్లేనని అందరూ గట్టిగా నమ్మారు. అయితే తిరిగి మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే తన వర్గం కౌన్సిలర్‌లతో చర్చలు జరిపిన క్రమంలో మళ్లీ అవిశ్వాసం అంశం తిరిగి తెరపైకి వచ్చింది.



చీరాల మునిసిపల్ కార్యాలయం

జంజనంకు అదృష్టం వరించిందిలా

వైసీపీ హయాంలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 33 వార్డులకు సంబంధించి వైసీపీకి 21, స్వతంత్రులుగా-11, టీడీపీ-1 స్థానం దక్కించుకున్నారు. అయితే బాలినేని చొరవతో స్వతంత్రులు, టీడీపీ ఏకైక స్థానం వైసీపీకి మద్దతు తెలపడంతో అప్పటి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అండదండలతో జంజనం శ్రీనివాసరావు చైర్మన్ స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే అప్పట్లోనే కొందరు చైర్మన్ స్థానంపై ఆశావాహులు స్పష్టంగా బలమైన ప్రయత్నాలు సాగించినప్పటికీ అదృష్టం జంజనంను వరించింది. ఇలా సాగుతున్న పురపాలక సంఘం పాలక వర్గంలో టీడీపీ కూటమి అధికారంతో చాలా మార్పులు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు, గెలుపు అనంతరం మరికొందరు మొత్తంగా ప్రస్తుతం 15 మంది కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే కొండయ్య వెంట ఉన్నారు. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న పాలన సమయంలో కొన్నిసార్లు స్వల్పంగాను, మరికొన్ని సార్లు జరిగిన వాడివేడి చర్చలతో అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చింది. ఈక్రమంలో ప్రస్తుతం టీడీపీకు 15, వైసీపీకి 13 కౌన్సిలర్‌లు, ఆమంచి వర్గానికి సంబంధించి 5గురు కౌన్సిలర్‌లు ఉన్నారు. అయితే మునిసిపాలిటీలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలను కలుపుకుంటే టీడీపీ బలం ఇప్పటికే 17కు చేరింది. ఈక్రమంలో చైర్మన్ పగ్గాలు చేపట్టేందుకు కనీసం 22 మంది కౌన్సిలర్‌లు ఉండాల్సి ఉంది.

తారస్థాయికి చేరిన అవిశ్వాస అంశం

గత ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంతో వివాదం తార స్థాయికి చేరింది. ఆసమయంలో అవిశ్వాసం జరుగుతుందని ఎమ్మెల్యే కొండయ్య కూడా ఘంటా పథంగా చెప్పారు. దీంతో కొంతమేరకు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయనే చెప్పాలి. అదే సమయంలో ఆశావాహులు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే ఒకవేళ అవిశ్వాసం జరిగినా ఆశావాహుల్లో ఎవరో ఒకరికే అదృష్టం ఉంటుంది కాబట్టి చైర్మన్ స్థానంపై ఆశించి భంగపడిన వారిని తృప్తి పరిచే క్రమంలో కచ్చితంగా సమస్యలు మళ్లీ తీవ్రమయ్యే అవకాశం లేకపోలేదు. ఇదిలావుంటే సంతకాల సేకరణ అనంతరం శని, ఆది రెండు రోజులు సెలవులు రావడంతో వచ్చే సోమవారం సేకరించిన సతకాలతో కలెక్టర్‌ను టీడీపీ కౌన్సిలర్‌లు కలువనున్నట్లు సమాచారం. అయితే దీనిపై పూర్తి క్లారిటీ కోసం వేచి చూడాల్సిందే.


రైతుల ఫిర్యాదు మేరకు గ్రానైట్ క్వారీ ఆక్రమించిన దారిని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

గ్రానైట్ క్వారీ ఆక్రమణలో పురాతన దారి

- మల్లాయపాలెం రైతులు అధికారులకు ఫిర్యాదు
- పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

బల్లికురవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పురాతన కాలం నుంచి పొలాలకు వెళ్లే దారిని ఆర్హా గ్రానైట్ క్వారీ అడ్డగోలుగా ఆక్రమించి పంట భూములకు వెళ్లకుండా చేస్తుందని కొత్త మల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి గంగాధర్ మరి కొందరు రైతులు అధికారులకు వరుస ఫిర్యాదులు చేశారు. రైతుల ఫిర్యాదులపై గురువారం జిల్లా మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ నాగలక్ష్మి ఆర్హా గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఈసందర్భంగా గ్రానైట్ క్వారీ యజమాని అయిన బాచిన కృష్ణచైతన్యతో అధికారులు మాట్లాడారు. క్వారీ యజమాని వద్ద ఉన్న రికార్డులు అందించాలని వారు కోరారు. అనంతరం రైతులతో వారు మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఎన్నో దశాబ్దాల నుంచి పొలాలకు వెళ్లే దారి సర్వే నెంబరు 871లో ఉందని, వైసీపీ హయాంలో కొందరు అధికారులు తమకు దారి లేకుండా చేశారని తహసీల్దార్, ఆర్డీవో రికార్డుల్లో పురాతన దారి ఉందని నివేదిక ఇచ్చారని తక్షణమే తమకు దారిని కేటాయించాలని లేకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో రెవెన్యూ సర్వేయర్ నారాయణరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. ఈ ఫిర్యాదులపై మైనింగ్ ఆర్ఐ రాజేంద్ర ప్రాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సర్వే చేసేందుకు మండల సర్వేయర్ లేక పోవ డంతో మరో మారు వస్తామని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

సాధారణ కాన్పులతో తల్లీబిడ్డ క్షేమం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సాధారణ కాన్పులతో తల్లికి, బిడ్డకు క్షేమంగా ఉండడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని గర్భిణీ, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ కె.వాహిల చౌదరి తెలిపారు. గురువారం అద్దంకి సీహెచ్‌సీలో గర్భిణులు, ఆశా కార్యకర్తలకు కాన్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ కాన్పులను ప్రోత్సహించాలన్నారు. ఆపరేషన్ జరగడం వలన అంటు వ్యాధులు, రక్త స్రావణ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తద్వారా తల్లికి ఆరోగ్య పరంగా ఇబ్బంది అని తెలియజేశారు. గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించడంతో పాటు సాధారణ కాన్పుల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని డాక్టర్ వాహిల సూచించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉడుత్త సూర్యారావు జ్ఞాపకార్థం కుమారుడు లక్ష్మణ్ కుమార్ ఉమ సౌజన్యంతో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అనుమతించిన ఆర్టీసీ డిపో మేనేజర్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ ఐతా రాజా, జోన్ చైర్మన్ వీవీ ఆదినారాయణ, మోహన్‌వంశీనాథ్, విజయలక్ష్మి, ఎన్వీ రమణ, హరిబాబు, జయరామ్, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీలో పన్నుల వివరాలను ఇవ్వాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు చేసిన పైకము 100శాతం పంచాయతీ సాధారణ నిధులకు జమచేయాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. పన్నుల వివరాలను ఈ నెల 5వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి విఫలమైతే నిధులు దుర్వినియోగం చేసినట్లు భావించి వారిపై శాఖాపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నిరుపేద బాలింతకు ఆర్థిక సాయం

- ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన తల్లి
- వారిలో మగ శిశువు మృతి, మరో ఇద్దరికి వైద్యం


చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ రోడ్డులో నివాసముంటున్న ఓ నిరుపేద బాలింత కోమట్ల ధనలక్ష్మి ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే వారిలో ఒక మగ బిడ్డ మృత్యువాత పడగా, మరో మగ బిడ్డ, ఆడ బిడ్డకు వైద్యం పొందేందుకు అవసరం ఉంది. ఈక్రమంలో బాలింత, చిన్నారులను కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆ కుటుంబానికి కుమ్మరి కోటిరెడ్డి (కేకేఆర్) చారిటబుల్ ట్రస్టు ఓటికుండల విజయ భాస్కరరెడ్డి (యూఎస్ఏ) మిత్రులతో కలిసి రూ.లక్ష చెక్కును బంధువులకు అందజేశారు. అలాగే మరో దాత రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, అంజిరెడ్డి, వేజెండ్ల శ్రీనివాసరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

పరారీలో మరో నిందితుడు జీఆర్పీ కానిస్టేబుల్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేయగా, మరో నిందితుడు జీఆర్‌పీ కానిస్టేబుల్ పరారీలో ఉన్నారు. గురువారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎండి మొయిన్ ఆ కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన చీదరబోయిన నాగేశ్వరరావు ప్రస్తుతం ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల సెలవులపై వచ్చారు. ఇతనికి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వీరయ్య, భరత్, వేణు, కుమార స్వామి, జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణకు గతంలో స్థలం వివాదం ఉంది. ఈక్రమంలో గత నెల 30వ తేదీన జరిగిన గొడవలో ఆరుగురు ఇతనిపై కత్తితో దాడిచేసి గాయపరిచారు. దీనిపై నమోదైన కేసులో ఐదుగురుని ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శేషగరిరావు, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.


ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్, పక్కన శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్


భవనాసి చెరువులో విరబూసిన తామర పువ్వులు

భవనాసికి తామర పువ్వుల శోభ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువులో తామర పువ్వులు విస్తారంగా ఉన్నాయి. ఆకాశంలో నక్షత్రాలు విరాజిల్లినట్లు చెరువు నీటిపై తామర పువ్వులు తెల్లగా మెరుస్తున్నాయి. శింగరకొండ వచ్చే భక్తులతో పాటు నామ్ రోడ్డున ప్రయాణించే ప్రజలు భవనాసి లోని తామరపువ్వుల అందాన్ని చూసి మురిసి పోతున్నారు.

ముప్పవరం ఉన్నత పాఠశాలలో జిమ్, గ్రంథాలయం ఏర్పాటు


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు

పంగులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలోని పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థుల వ్యాయామం కోసం జిమ్, జ్ఞానసముపార్జన కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ గ్రూప్, ఇంటరైజ్ సంస్థ, సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు జిమ్‌కు అవసరమైన పరికరాలు, ఇతర ఆటవస్తువులతో పాటు గ్రంథాలయ నిర్వహణకు అవసరమైన పుస్తకాలు, కుర్చీలు, బల్లలు సమకూర్చారు. దాతల సాయంతో సమకూరిన సామగ్రితో ఏర్పాటు చేసిన జిమ్, గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. వ్యాయామ గదిని రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధి వెంకటేష్ ప్రారంభించగా, గ్రంథాలయాన్ని సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు ప్రారంభించారు. దాతలకు హెచ్ఎం పుచ్చకాయల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, వెంకటేష్, సింహపురి హైవే ప్రతినిధులు కిరణ్‌కుమార్, ఆనంద్‌సింగ్, కోటేశ్వరరావు, గిరి, రోటరీ ఆంధ్ర చైర్మన్ గరిమిడి జగన్మోహన్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల సింగయ్య, పీడీ శేషగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయాలను గౌరవించండి


భానుచంద్రమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి స్థానిక మహిళా మండలిలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో భాగంగా కవి సమ్మేళనం జరిగింది. దీంతో కవులు, సైన్స్ ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పవని భానుచంద్రమూర్తి, శేష వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు. మదర్ సర్వీస్ సొసైటీ, ఆలమూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, అబ్రహం, బ్లెస్సీ డా.సజ్జా, వడలి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాలు నిండిని ప్రతి చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందించి వసతులు, పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని హెచ్‌ఎం ఎంపీ రమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిధిలోని గ్రామాలల్లో పర్యటించి విద్యార్థులను బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో నూతన బోధన, వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం వంటి వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాల లోని మీ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంతో, సీర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే ప్రారంభం



రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, పోలూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ రవికుమార్

- సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

కావూరివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు రీ-సర్వేలో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని కావూరివారి పాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా, హద్దులు, తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందని చెప్పారు. అందుకు సంబంధించి శుక్రవారం గవినివారిపాలెంలో నిర్వహించే గ్రామ సభలో భూ యజమానులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, వీఆర్వో సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

మార్టూరు : రైతులు రీసర్వేపై పూర్తి అవగాహనతో ఉండాలని, అధికారులకు సహకరించాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. గురువారం యద్దనపూడి మండలంలోని యనమదల,పోలూరు గ్రామాలలో రీసర్వేపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు ఆర్డీవో గ్లోరియా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ సభలో మాట్లాడుతూ గ్రామాలలో రైతులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తున్నదన్నారు. రైతులు సహకరించాలని,వారి భూములు, పొలాలవివరాలును సక్రమంగా నమోదు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గ్రామ సచివాలయం వద్ద తహసీల్దార్ కే రవికుమార్ ఆధ్వర్యయింలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ విష్ణుప్రసాద్, మండల సర్వేయర్ సాంబశివరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు రావిపాటి సీతయ్య పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కొండమూరు, బూదవాడ గ్రామాలలో భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం రెండు గ్రామాలలో తహసీలార్ సింగారావు నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగారావు మాట్లాడుతూ ఈ ఏడాది తొలివిడతగా బైటమంజులూరులో రీ-సర్వే చేపట్టి కొనసాగిస్తున్నామన్నారు. కొండమూరు, బూదవాడ గ్రామాలలో గురువారం నుంచి రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలతో ఒక్కో గ్రామానికి మూడు బృందాలను నియమించినట్లు తెలిపారు. అవగాహన ర్యాలీలో తహసీల్దార్ సింగారావు, డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ శ్వేత, గ్రామ నేతలు అంజయ్య, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండలం నూతలపాడులో రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ, సర్పంచ్ చిన్నయ్య, మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఎస్ఎస్‌లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

చినగంజాం : గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని చినగంజాం, సంతరావూరు గ్రామాల్లో రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేపై రైతులకు ముందుగా సమాచారం తెలియజేస్తామన్నారు. సర్వే సమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు రా యని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ సర్వేను వినియోగించుకోవాలని తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతరావు, సాంబయ్య,మార్క్ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం విక్రయాలపై జాగ్రత్తలు పాటించండి

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బెల్లం విక్రయాలు జరిపే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్టేషన్‌లో బెల్లం దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. విక్రయాలకు సంబంధించి కచ్చితంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాలలో జరుగుతున్న నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణంలోని గరటయ్యకాలనీ సమీపంలో అర్బన్ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణ పనులు గురువారం కమిషనర్ పరిశీలించారు. శ్మశానం పక్కన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రహరీ గోడ, రేణింగవరం రోడ్డు వెంబడి కల్వర్టు పనులను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. మొండితోకపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న సైడ్ డ్రైన్ పనులు పరిశీలించారు. బంగ్లా రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఫుడ్ స్టాల్ పై విద్యార్థుల తల్లిదండ్రులు, కౌన్సిలర్‌ల నుంచి ఫిర్యాదులు అందడంతో రవీంద్ర పరిశీలించారు. ప్యాకింగ్ లేని తినుబండారాలు అమ్మవద్దని తెలిపారు. శానిటేషన్, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు.

వైభవంగా రామాలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ

భక్తులకు అన్నదానం

మార్టూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో ఈశాన్య రామాలయం పైభాగాన శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చ రణతో గురువారం వైవంగా జరిగింది. ఉదయం గణపతిపూజ నిర్వహించారు. వివిధ రకాల పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠను చేశారు. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసీతా రామలక్ష్మణాంజనేయ స్వామి ఉత్సవ విగ్ర హాలకు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నేళ్ల నుంచి శిథిల దశలో ఉన్న రామాలయంలో మరలా ప్రత్యేక పూజలు జరగడం పట్ల తూర్పుబజారులోని ప్రజానీకం సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి పండుగ రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు.


రామాలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు, భక్తులు

8 నుంచి స్వామివార్ల కల్యాణ మహోత్సవం

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ చెన్న కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 8 నుంచి 12 వరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 11వ తేదీన స్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.